
సాక్షి
వికారాబాద్

సోమవారం, 20, మార్చి, 2023



ఆటలు సాగేదెలా ?

గ్రామాల్లో క్రీడా మైదానాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. యువత ఆటలకు నోచుకోవడంలేదు. 8లో▶



బాలుడి అప్పగింత

హైదరాబాద్‌లో తప్పిపోయిన బాలుడిని మోమిన్‌పేట పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. 8లో▶



నిధులు లేక నిలిచిన పనులు

నిధులు మంజూరు కాకపోవడంతో ఉర్దూ మాధ్యమ పాఠశాల అదనపు భవన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడంలేదు. 9లో▶

న్యూస్‌రీల్

రేపు లబ్ధిదారుల ఎంపిక

తాండూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అశోక్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23వ సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే లబ్ధిదారుల ఎంపికకు హాజరు కావాలన్నారు. ఆన్‌లైన్ రశీదు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో రావాలని కోరారు.

'రుణాలు రెన్యువల్ చేసుకోండి'

కొడంగల్: హస్నాబాద్ ప్రాథమిక సహకార సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వాయిదాలు చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత మార్చి నెల నుంచి ఈ మార్చి వరకు కిస్తులు చెల్లించిన వారికి వడ్డీలో రాయితీ ఉంటుందని అన్నారు. మార్చిలో చెల్లించని వారికి 14 శాతం వడ్డీ పడుతుందన్నారు. పంట రుణాలు, స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక రుణాలు ఈనెల 31వ తేదీ వరకు రెన్యువల్ చేసుకోవాలన్నారు.

దామగుండం
ఆలయ అభివృద్ధికి కృషి



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పూడూరు: దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. రామలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఆదివారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాన్ని విధాల తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి , బీజేపీ నేత డాక్టర్ ఏ చంద్రశేఖర్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేతో పాటు పలువురిని సన్మానించింది. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, సర్పంచ్ నవ్య, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు
అన్ని రంగాల్లో రాణించాలి



సన్మానిస్తున్న కళాశాల అధ్యాపక సిబ్బంది

కొడంగల్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ అభివృద్ధి చెందాలని హైకోర్టు న్యాయవాదులు ఏబీ.జ్యోత్స్న, ఎం.వకుళ, స్వప్నిక రేహ ఫౌండేషన్ సభ్యురాలు టి.మహాలక్ష్మి, విశ్రాంత ఇంజనీర్ జి.కొండల్‌రావు అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్ డాక్టర్ రాజారాం అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల హక్కుల గురించి వివరించారు. మహిళలు లక్ష్య సాధన దిశగా సాగుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మహిళలు చదువుకుంటేనే కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోజూ కొంత సమయం యోగా చేయడంతో మానసిక ప్రశాంతత చేకూరుతూ ఉల్లాసంగా ఉండేందుకు తోడ్పడుతుందని అన్నారు. కళాశాల అధ్యాపక సిబ్బంది అతిథులను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో డబ్ల్యూఈసీ కన్వీనర్ హరిప్రియ, కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ రఫియాఖానం, అధ్యాపకబృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన సెమినరేట్

నందిగామ: విద్యార్థుల నృత్యాలు.. ఆకట్టుకునే నాటకాలు.. అబ్బురపరిచే విన్యాసాలు.. వినసొంపైన పాటలతో సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ హోరెత్తింది. సెమినరేట్-2023ను ఆదివారం ఘనంగా ముగించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా అలరించాయి. పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ రాష్ట్రాల్లోని వేషభాషలతో ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, డిప్యూటీ డైరెక్టర్ శ్యాంసుందర్, క్యాంపస్ అడ్మిన్ సీవీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



యాలాల: దెబ్బతిన్న వేరుశనగ పంటను చూపిస్తున్న రైతు



మర్పల్లి: పంచలింగాలలో పొలంలోనే ఉల్లిపంట

రంగుమారిన పల్లి.. పొలంలోనే ఉల్లి

వడగళ్ల వానలు రైతులను నట్టేట ముంచాయి. మూడు రోజులుగా వానలు కురుస్తుండటంతో పంటలన్నీ నేలపాలయ్యాయి. చేతికొచ్చేవేళ పంటలు దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. బంట్వారం, మర్పల్లి మండలాల్లో వందలాది ఎకరాల్లో ఉల్లి, మొక్క జొన్న, పూల తోటలు చేలల్లోనే నీటిపాలయ్యాయి. యాలాల మండలంలో సుమారు 11 వందల ఎకరాల్లో వేరుశనగ పంట రంగుమారింది. పొలంలోనే నల్లబడి, బూజు, మొలకెత్తింది. పెట్టుబడులు కూడా రానిదుస్థితి నెలకొందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

– మర్పల్లి/యాలాల/ బంట్వారం

అకాల వర్షాలతో అపార నష్టం

- వడగళ్లతో ఉల్లి పంటలు నేలమట్టం
- నల్లబడి బూజుపట్టిన వేరుశనగ
- దెబ్బతిన్న పూల తోటలు
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు
- ఆదుకోవాలంటూ వేడుకోలు

వరుసగా కురుస్తున్న అకాల వర్షాలకు ఉల్లి, వేరుశనగ, ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేరుశనగ పంటతో పాటు కీర, టమాటా, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాలాల మండల కేంద్రంతో పాటు కమాల్‌పూర్, బాణాపూర్, రాస్నం, విశ్వనాథ్‌పూర్, పగిడియాల, అచ్యుతాపూర్, బాగాయిపల్లి, సంగాయగుట్టతండా తదితర ప్రాంతాల్లో వడగండ్ల వర్షం పడింది. ఆయా గ్రామాల పరిధిలో వరి పంటకు ఎలాంటి నష్టం వాటిల్లనప్పటికీ, కల్లంలో నిల్వ ఉంచిన వేరుశనగా పంట దెబ్బతింది. మండల పరిధిలో సుమారు 11వందల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. అకాల వర్షం కారణంగా నిల్వ ఉంచిన వేరుశనగా నల్లబడి, బూజు, మొలక మొలిచాయి. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్న నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు తక్షణం ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



బంట్వారం: మాలసోమారంలో జొన్న పంట దుస్థితి

బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో ..

బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో 500 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 13 గ్రామాల్లో మొక్క జొన్న, ఉల్లి, కూరగాయలు, జొన్న, పూల తోటలు ధ్వంసమైనట్లు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి, బార్వాద్, నాగసాన్‌పల్లిలో 300 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

పెట్టుబడి దక్కేలా లేదు

మూడున్నర ఎకరాలతోపాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వేరుశనగ సాగు చేశాను. కురిసిన వడగళ్ల వర్షం కారణంగా వేరుశనగ నల్లబడి, మొలకెత్తడం ప్రారంభించింది. పంటల సాగుకు దాదాపు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పెట్టుబడిలో సగం కూడా వచ్చే అవకాశం లేదు. చేతికొచ్చేవేళ అకాల వర్షం నేలపాలు చేసింది. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలి.

– శ్రీశైలం, రైతు, పగిడియాల

చేసిన కష్టం నేలపాలు



వడగళ్ల వానతో చేతికొచ్చిన వేరుశనగ పంట మొత్తం దెబ్బతిన్నది. వేరుశనగ మొత్తం మొలక ఎత్తి నల్లబారింది. ఆరుగాలం పడ్డ కష్టం ఒక్కరోజులో పోయింది. ఎండనక, రాత్రనక పంట కాపాడుతూ వస్తున్న మాకు వడగళ్ల వాన నట్టేటముంచింది. ప్రభుత్వం నష్టం అంచనావేసి ఆదుకోవాలి.

– సుజాత, మహిళా రైతు

రైతులను ఆదుకోవాలి



పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. మర్పల్లి, మోమిన్ పేట మండలాల్లో వంద శాతం మేర పంటలు దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.లక్ష చొప్పున వెంటనే పరిహారం చెల్లించాలి. ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలి.

– రాజిరెడ్డి, రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

తల్లడిల్లిన రైతు

మర్పల్లి మండలంలో ఉల్లి రైతులకు అపారమైన నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలోనే సుమారు 300 ఎకరాల ఉల్లి పంట దెబ్బతిన్నది. మండలం వ్యాప్తంగా 450 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. పంట చేతికి వచ్చే వేళ వడగళ్ల వాన నేలమట్టం చేసిందని రైతులు వాపోతున్నారు. ఉల్లి పంటతో పాటు కూరగాయలు, మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడికాయలన్నీ నేలరాలాయి. హెలికాప్టర్‌లో మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో ఉద్యాన, వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. తక్షణం పంట నష్టం వివరాలు సేకరించాని మంత్రులు కలెక్టర్ నారాయణరెడ్డికి, వ్యవసాయ శాఖ యంత్రాంగానికి సూచించారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పంచలింగాల, కొత్లాపూర్, సిరిపురం, వీర్లపల్లి, రావులపల్లి, కుడుగంట, మర్పల్లి, బూచన్‌పల్లి గ్రామాల్లో వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

కొన్ని గ్రామాల్లోనే వివరాల సేకరణ

మండలం వ్యాప్తంగా ఉల్లితోపాటు కూరగాయలు, ఆకుకూర పంటలు, మామిడి తోటలకు వంద శాతం నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. అయితే అధికారులు కొన్ని గ్రామాల్లో వివరాలు సేకరించారని అన్ని గ్రామాల్లో సేకరించలేదని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో వివరాలు సేకరించాలని వారు కోరుతున్నారు.



మామిడికాయలన్నీ రాలిపోవడంతో దిగాలుగా రైతు

రూ.60 వేల నష్టం



ఎకరా మేర ఉల్లి పంట సాగు చేశాను. అన్ని కలిపి సుమారు రూ. 60 వేల వరకు పెట్టుబడి పెట్టాను. 24 గంటలూ కష్టపడి కంటికి రెప్పలా చూసుకొని పంట ఏపుగా పెంచాను. కూలీలను తీసుకువచ్చి పంట తీస్తుండగా ఒక్కసారిగా వడగళ్ల వాన కురిసి పంటంతా నేలమట్టం చేసింది. చేసిన కష్టం, పెట్టుబడి అంతా నేలపాలైంది. ప్రభుత్వం పరిహారం ఇచ్చి తమను ఆదుకోవాలి.

– గొల్ల రాములు, రైతు

ఎకరాకు రూ.లక్ష పరిహారమివ్వాలి

మంత్రి నిరంజన్‌రెడ్డికి మాజీమంత్రి వినతి

అనంతగిరి: జిల్లాలో వడగళ్ల వల్ల వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి వనతిపత్రం ఇచ్చారు. ఉల్లి, అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన మంత్రికి వివరించారు. పంట చేతికొచ్చే వేళ వడగళ్ల వాన నేలపాలు చేసిందని అన్నారు. ఎకరాకు రూ. లక్ష రూపాయల నష్టపరిహారం అందజేయాలని ఆయన మంత్రికి విన్నవించినట్లు ఆయన తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్‌కుమార్



పరిగిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిరుద్యోగులతో సర్కార్ చెలగాటం

- పేపర్ల లీకేజీ ఇద్దరు వ్యక్తుల తప్పిదం అనడం సిగ్గుచేటు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- పరిగిలో సీఎం దిష్టిబొమ్మ దహనం

పరిగి: రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతోందని, నిరుద్యోగులు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్లు లీక్ కావడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. స్థానిక బస్టాండ్ ఎదుట సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేపర్ల లీకేజీలో ప్రభుత్వానిది తప్పిదంలేదని, ఇద్దరు వ్యక్తుల చేసిందని మంత్రి కేటీఆర్ చెప్పడం సిగ్గుచేటన్నారు. సుమారు 30 లక్షల మంది నిరుద్యోగులతో సర్కార్ చెలగాటమాడుతోందన్నారు. అసమర్థుడి పాలన వల్ల రాష్ట్రం అప్పుల పాలయ్యిందని ఆయన మండిపడ్డారు. యువత పోరాటం చేసి జీవితాలను త్యాగం చేసి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు ఇంత అన్యాయం చేయడం దారుణమన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు దక్కాయని, నిరుద్యోగులకు రాలేవన్నారు. ఉద్యోగాలను అడ్డగోలుగా డబ్బులకు అమ్ముకుంటున్నారన్నారు. కేసీఆర్ అవినీతి పాలనకు పేపర్ లీకేజీలే నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నిరుద్యోగులు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు, ఆయా మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, విజయ్‌కుమార్‌రెడ్డి, రామకృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేస్తాం

- ఎంపీ రంజిత్‌రెడ్డి
- మోమిన్‌పేట మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మోమిన్‌పేట: అకాల వర్షంతో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సయ్యద్ అల్లిపూర్, పల్లెగుట్టతండాలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. నష్టపోయిన బొప్పాయి, అరటి, టమాటా, మొక్కజొన్న, జొన్న, ఉల్లి తదితర పంటలను చూసి ఆవేదన చెందారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రెండు మూడు రోజుల్లో ప్రతి గ్రామాన్ని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేస్తారని చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతులకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. చేతికి వచ్చే క్రమంలో పంటలను ప్రకృతి నేల మట్టం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి గుంటను నష్టం అంచనా వేయాలని ఎంపీ సంబంధిత అధికారులను ఆదేశించారు. వడగళ్ల వల్ల డ్రిప్ పైపులు, పరికరాలు కూడా దెబ్బతిన్నట్లు రైతులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సిమెంటు రేకుల ఇళ్లు కూడా దెబ్బతిన్నాయని, నివాసం ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వడగళ్ల వర్షానికి గాయ పడిన లక్ష్మిని ఎంపీ పరామర్శించారు. కార్యక్రమంలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, ఎంపీటీసీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, మండల వ్యవసాయాధికారి జయశంకర్, సర్పంచులు సత్యనారాయణరెడ్డి, కాశిరాం, అంజయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.



సయ్యద్‌అల్లిపూర్‌లో పాడైన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్

కనులవిందుగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- తిరుమల తిరుపతి నుంచి అర్చకుల రాక
- శాస్త్రోక్తంగా పూజలు
- పెద్ద శేషవాహనంపై ఊరేగిన స్వామివారు

కొడంగల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి నుంచి వచ్చి అర్చకులు శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణలతో దేవాలయం మారుమోగింది. స్వామివారు తిరుచ్చి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా గరుత్మంతుడి చిత్రపటాన్ని కొత్త వస్త్రంపై లిఖించి పూజలు చేసి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమలకు వెళ్లలేని భక్తులు ఇక్కడకు వచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. తిరుమల నుంచి ఇక్కడికి ప్రతి సంవత్సరం బ్రాహ్మణులు వచ్చి పూజలు చేయడం సంప్రదాయం. గరుడోత్సవం రోజు తిరుమల నుంచి శేషవస్త్రాలను తీసుకొస్తారు.



తిరుచ్చి వాహనంపై స్వామివారు

వాహన సేవలు షురూ..

శ్రీవారి ఆలయంలో వాహన సేవలు ప్రారంభం అయ్యాయి. వారం పాటు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు, రాత్రి 9 గంటలకు వాహన సేవలు నిర్వహిస్తారు. ఆలయం మాడ వీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి పెద్ద శేషవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శుభప్రద్‌పటేల్

పెద్దేముల్: రంజాన్ పండుగ ఉపవాస దీక్ష క్యాలెండర్‌ను ఆదివారం మండలంలోని మంబాపూర్‌లో రాష్ట్ర బీసీ కమిషనర్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ ముస్లిం మత పెద్దలతో కలసి ఆవిష్కరించారు. ముందుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి చిహ్నమన్నారు. భక్తిశ్రద్ధలతో ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్ ప్రకాశం, శ్రీను, ముజీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు టౌన్: రంజాన్‌ను పురస్కరించుకుని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ ఉపవాస దీక్ష క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అబీద్, షేక్ ఫరీద్, మహ్మద్ యాసుఫ్, హనీఫ్, వహీద్, మస్తాన్, శుభప్రద్ యువ సేన సభ్యులు భానుప్రసాద్, బాలు, శ్రీశైలం, విజయ్, హరీష్, మురళీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పరిగి: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు పొలంలో చెట్టుకు ఉరేసుకొని చనిపోయిన సంఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి పట్టణానికి చెందిన ఎండీ ఆసీఫ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రులలో వైద్యం తీసుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

లారీ అపహరణ



తాండూరు టౌన్: పార్కింగ్ చేసిన లారీ అపహరణకు గురైన సంఘటన శనివారం అర్ధరాత్రి తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన నర్సింహారెడ్డి అనే వ్యాపారికి చెందిన లారీ (టీఎస్ 08 యూఏ 6359) పట్టణంలోని లారీ పార్కింగ్ వద్ద నిలిపారు. అయితే శనివారం అర్ధరాత్రి దాటిన లారీ చోరీకి గురైంది. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా లారీ సంగారెడ్డి వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా తెలిసిందన్నారు.

ఆటలు సాగేదెలా ?

అసంపూర్తిగా క్రీడా ప్రాంగణాలు

- కొన్ని చోట్ల బోర్డులకే పరిమితం
- బిల్లులు రాక లబోదిబో మంటున్న సర్పంచులు

పెద్దేముల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. లక్ష్యం బాగున్నా ఆచరణలో విఫలమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రీడా ప్రాంగణాలకు స్థలాల ఎంపికలో, నిధుల మంజూరులో నిర్లక్ష్యం కారణంగా యువత ఆటలకు దూరమవుతున్నారు. 8 నెలల క్రితం మండలంలోని అన్ని పంచాయతీలకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు మంజూరు చేసింది. ఒక్కో క్రీడా ప్రాంగణాన్ని రూ. 2లక్షలతో నిర్మించాలని ఆదేశించింది. ఈ బాధ్యతలను పంచాయతీ సర్పంచులకు అప్పగించింది. దీంతో చాలా మంది సర్పంచులు అప్పులు చేసి క్రీడా ప్రాంగణ పనులను ప్రారంభించారు. నిధులు లేక పలు పంచాయతీల్లో బోర్డులు పాతి వదిలేశారు. దీంతో అవి ఎందుకూ ఉపయోగపడడం లేదు. 37 పంచాయతీల్లో క్రీడా మైదానాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఇప్పటి వరకు 50శాతం పనులు కూడా పనులు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో బోర్డులకే పరిమితమయ్యాయి. మరి కొన్ని చోట్ల పనులు చేసినా సకాలంలో బిల్లులు అందక సర్పంచులు లబోదిబో మంటున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేరని పలు గ్రామాల సర్పంచులు మండి పడుతున్నారు. మండలంలోని ఒక్కో పంచాయతీలో క్రీడా ప్రాంగాణం కోసం రెవెన్యూ శాఖ 20 గుంటల భూమిని కేటాయించింది. కందనెల్లి తండా క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలంలో పిచ్చి మొక్కలు, పెద్ద పెద్ద రాళ్లు ఉండడంతో అది ఎందుకూ ఉపయోగపడడం లేదు. దీనికి తోడు అటవీ భూమిని కేటాయించడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. గాజీపూర్, ఖాణాపూర్, గోట్లపల్లితో పాటు మరి కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి వచ్చినా బిల్లులు రాలేదని ఆయా గ్రామాల సర్పంచులు వాపోతున్నారు. బిల్లులు అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతంలో రైతు వేదికలు, పల్లె ప్రగతి పనుల కోసం వెచ్చించిన డబ్బు కూడా ఇప్పటి వరకు అందలేదని తెలిపారు. తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నామని గాజీపూర్, మంబాపూర్, పెద్దేముల్, గోపాల్‌పూర్, తట్టెపల్లి, ఇందూరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పనులతో పాటు బిల్లులు సకాలంలో మంజూరు చేస్తే బాగుంటుందని సర్పంచులు అంటున్నారు.



కందనెల్లి తండాలో ఆటలకు అనుకూలంగా లేని క్రీడా ప్రాంగణం

ఒక్క రూపాయి రాలేదు



గాజీపూర్‌లో క్రీడా ప్రాంగణానికి రూ. 2లక్షలకు పైగా ఖర్చు చేశా. పనులు పూర్తయి నాలుగు నెలలు అవుతోంది. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. అధికారులను అడిగితే కాలం వెల్లదీస్తున్నారు. అప్పులకు వడ్డీలు కట్టక లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు మంజురు చేయాలి.

– వీరప్ప, సర్పంచ్, గాజీపూర్

అప్పుల పాలవుతున్నాం



చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. దీంతో అప్పుల పాలవుతున్నాం. పల్లె ప్రగతి, రైతు వేదిక, ఇతర అభివృద్ధి పనులకు రూ. 6లక్షల వరకు వెచ్చించా. ఇంత వరకు బిల్లులు రాలేదు. నెలనెలా వడ్డీ కట్టి అప్పుల పాలవులతున్నాం. మా గోడు ఎవరికి చెప్పినా లాభం లేదు. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజురు చేయాలి.

– రాములు, సర్పంచ్, గోపాల్‌పూర్

ప్రతిపాదనలు పంపాం



పూర్తయిన క్రీడా ప్రాంగణాల బిల్లులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. బిల్లులు వచ్చిన వెంటనే అందజేస్తాం. అభివృద్ధి పనులు ఆపరాదు, నిధులు మంజూరవుతాయి. త్వరల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్ మండలం

ఆలయాల నిర్మాణానికి కృషి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి, వీధి నాటకాలను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో రామాలయ నిర్మాణానికి రూ. 40 వేలు, మైలారంలో పోచమ్మ ఆలయానికి రూ. 57 వేలు, బొంపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ. 50 వేలు, బట్ల చందారంలో వీవబ్రహ్మం గారి జీవిత చరిత్ర వీధీ నాటకానికి రూ. 15 వేలు, బడేంపల్లిలో శివభక్త శిరియాళ వీధి నాటకానికి రూ. 20 వేల విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలన్నారు. ప్రాచీన కాలం నాటి వీధి నాటకాలు నేటికీ కొనసాగించడం హర్షించదగ్గ విషయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎం విజయ్ కుమార్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లిలో రామాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాళ్లాపూర్ లొంక అంబ భవాని ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిమార్గాన్ని అనుసరించాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆయల కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకాలు గత చరిత్రకు ప్రతిబింబాలు

కుల్కచర్ల: వీధి నాటకాలు గత చరిత్రకు ప్రతిబింబాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగిలోని తన నివాసంలో ఈ నెల 25నుంచి బొంరెడ్డిపల్లిలో ప్రదర్శించనున్న లవకుశ వీధి నాటకం కరపత్రాలను విడుదల చేశారు. నాటకాన్ని వీక్షించేందుకు రావాలని ఎమ్మెల్యేను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలోనూ వీధి నాటకాలు ఆడుతూ గత చరిత్రను ప్రస్తుత సమాజానికి తెలియజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొంరెడ్డిపల్లి సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు చంద్రయ్య, మొగులయ్య, హన్మంతు, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జనచైతన్య యాత్రను సక్సెస్ చేయండి

కొడంగల్ రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి ప్రారంభ కానున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 24వ తేదీ ఉదయం 11గంటలకు నిజామాబాద్ జిల్లా నుంచి యాత్ర ప్రారంభమవుతుందని, 29న హైదరాబాద్‌లో ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు దోచి పెడుతోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, సరుకుల ధరలు పెంచుతూ సామాన్య, మధ్య తరగతి వర్గాలపై అదనపు భారం వేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్న తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 26న వికారాబాద్ జిల్లాలో యాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లయ్య, రాములు, ఆటో యూనియన్ నాయకులు సూర్య రాథోడ్, అరుణ్‌కుమార్, రాజేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: ఈ నెల 26న జరిగే జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం కోరారు. ఆదివారం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ యాత్ర మోమిన్‌పేట మీదుగా వికారాబాద్ చేరుకుని పరిగి, కుల్కచర్ల మీదుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మైపాల్, శ్రీనివాస్, లాలయ్య, రాజు, హరికృష్ణ, భూషన్, రత్నం, దావీద్, దిలీప్, వెంకటేష్ పాల్గొన్నారు.



అనంతగిరి: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తెలుగు పండితులకు పురస్కారాలు



పురస్కారం అందుకున్న తెలుగు భాషా పండితులు

- అలరించిన లవకుశుల పాటలు
- ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వారోత్సవాలు



గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

తాండూరు టౌన్: కవయిత్రి మొల్ల కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం 11 మంది తెలుగు భాషా పండితులకు మొల్ల సాహిత్య పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆచార్యులు సూర్య ధనుంజయ, ఆల్ ఇండియా రేడియో అనౌన్సర్, తెలుగు వ్యాఖ్యాత మడిపల్లి దక్షిణామూర్తి హాజరై పురస్కారాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 16వ శతాబ్దంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని, మొక్కవోని విశ్వాసంతో మొల్ల కేవలం ఐదు రోజుల్లో రామాయణాన్ని తెలుగులో రచించారన్నారు. ఆమె పట్టుదల, కృషి నేటి యువతులు, మహిళలకు ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించాలని, రచనల ద్వారా తమలోని సృజనాత్మకతను బయట పెట్టాలన్నారు. అనంతరం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు లవకుశల వేషధారణలో గీతాలు ఆలపించి అందరినీ అలరించారు. మొల్ల జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని పలు పాఠశాలల్లో నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం, పద్యాల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కే విజయలక్ష్మి, మొల్ల కళా వేదిక వ్యవస్థాపకులు వెంకట్, విద్యావంతుల వేదిక ప్రతినిధి రవీందర్ గౌడ్, రిటైర్డ్ టీచర్ జీ బస్వరాజ్, మణిపూసల రూపకర్త వడిచర్ల సత్యం, పలు పాఠశాలల ప్రిన్సిపాళ్ల డాక్టర్ రమణమ్మ, జెసింతా బాస్కో, వెంకట్, యూసుఫ్, కోటం చంద్రశేఖర్, నరసింహ, అశోక్, అంజిలప్ప పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి

ఎమ్మెల్యేకు బీజేపీ నాయకుల సవాల్



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

తాండూరు టౌన్: నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి బహిరంగ చర్చకు రావాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో తాండూరు మున్సిపల్ వార్డుల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి అడుగంటి పోయిందని విమర్శించారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధిని పూర్తిగా మరిచి పోయారన్నారు. తాండూరు మున్సిపాలిటీలోని ప్రతి వార్డునూ రూ. కోటితో అభివృద్ధి చేస్తామన్న ఎమ్మెల్యే మాట తప్పారని మండిపడ్డారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల సమస్యలు వెంటాడుతున్నాయని పేర్కొన్నారు. తాండూరు అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, సమయం, తేదీ చెప్పాలని ఎమ్మెల్యేకు సవాలు విసిరారు. ప్రధాని మోదీ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత, పార్టీ జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ లలిత, కౌన్సిలర్ బాలప్ప, బీజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

మోమిన్‌పేట: హైదరాబాద్‌లో తప్పిపోయిన బాలుడిని మోమిన్‌పేట పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్‌ఐ విజయప్రకాష్ కథనం మేరకు.. ఈ నెల 12న బూరుగుపల్లి శివారులో అర్ధరాత్రి బాలుడు పెట్రోలింగ్ పోలీసులకు కనిపించాడు. ఎస్‌ఐ ఆ బాలుడి వివరాలు తెలుసుకునే ప్రయత్నించాడు. అయితే ఏమీ చెప్పలేదు. దీంతో నైట్ హెల్స్ ఆల్ సొసైటీ ఆశ్రమానికి తరలించి మిస్సింగ్ కేసులపై ఆరా తీశారు. ఒరిస్సా రాష్ట్రం గోవిందాపూర్ ప్రాంతానికి చెందిన బాలుడిగా గుర్తించారు. అయితే బాలుడి మామ శంకర్‌నాయక్ పని నిమిత్తం హైదరాబాద్‌కు పిలుచుకొని వచ్చినట్లు తెలిసింది. గత నెల 11న పని చేసే ప్రదేశం నుంచి బాలుడు వెళ్లిపోయాడు. దీంతో 21న సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు వచ్చి బాలుడిని తీసుకెళ్లారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సీసీఎస్ సీఐ దాసు, ఎస్‌ఐ విజయప్రకాష్, ఆశ్రమ నిర్వాహకులు సుందర్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కారు దగ్ధం

కేశంపేట: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు దగ్ధమైంది. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారుజమున చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ షాద్‌నగర్‌లో కారు మెకానిక్‌గా కొనసాగుతున్నాడు. షాద్‌నగర్ నుంచి బోధునంపల్లికి వెళ్తుండగా ఆదివారం తెల్లవారుజమున సుమారు 4గంటల ప్రాంతంలో కేశంపేట శివారులోని చర్ల మైసమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా గుర్తు తెలియని వాహనం అడ్డుగా రావడంతో దానిని తప్పించే ప్రయత్నంలో కారు రోడ్డు కిందకు వెళ్లింది. దీంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలను గుర్తించిన శివకుమార్ కారులో నుంచి దిగడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది.

వ్యక్తి అదృశ్యం

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఎల్లంబి సంగారెడ్డి(50) ఈ నెల 15న రాత్రి రూ.5వేలు తీసుకుని ఇంట్లో చెప్పకుండా వెళ్లాడు. తర్వాత వస్తానని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన సంగారెడ్డి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై సంగారెడ్డి భార్య వరలక్ష్మీ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 9490617241 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది



సంగారెడ్డి(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతగిరి: బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వికారాబాద్ మండలంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్‌కు చెందిన సోమ్‌నాథ్(31) పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితులు ప్రవీణ్, మల్లేష్‌లతో కలిసి బైక్‌పై పరిగికి బయలుదేరాడు. మండలంలోని గొట్టిముక్కల గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రవీణ్, మల్లేష్‌కు గాయాలయ్యాయి. మృతుని సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

షాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరి ధిలోని అంతారం గ్రామానికి చెందిన గొల్లపల్లి విజయ(40) భర్త గోపాల్ శనివారం ఉ దయం వ్యసాయ పొలం వద్ద వరి, మొక్కజొన్న పంటలకు మందు పిచికారీ చేశారు. పని పూర్తయ్యాక వంటకు కట్టెలు తీసుకుని వస్తానని భర్తను వెళ్లమని చెప్పింది. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో భర్త పొలం వద్దకు వెళ్లి వెతికినా కనిపించలేదు. చెరువు కట్టపై ఫోన్ చున్నీ లభ్యమయ్యాయి. మందు పిచికారీ చేసిన చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి చెరువులో పడిపోయి ఉంటుందని భర్త అనుమానం వ్యక్తం చేశాడు. ఆమెకు ఫిట్స్ వస్తుందని చెప్పాడు. గ్రామస్తుల సాయంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు భర్త ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైతుల సంతకాలు ఫోర్జరీ



హైటెన్షన్ టవర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- వారికి తెలియకుండానే హైటెన్షన్ టవర్ల ఏర్పాటు
- పనులు అడ్డుకుని పీఎస్‌లో ఫిర్యాదు చేసిన రైతులు

కందుకూరు: రైతులకు సమాచారం ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో నోటీసులిచ్చినట్లు చూపుతూ ఓ ప్రైవేట్ విద్యుత్ సంస్థ హైటెన్షన్ టవర్ల ఏర్పాట్లు పనులు ప్రారంభించింది. దీంతో విషయం తెలుసుకున్న రైతులు అక్కడకి చేరుకుని ఆందోళన చేపట్టారు. వివరాల ప్రకారం.. మండలంలోని మీర్‌ఖాన్‌పేట పరిధిలోని సర్వే నంబర్ 79, 80, 178, 179లలో పట్టాదారులకు సమాచారం ఇవ్వకుండానే వరోరా కర్నూల్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం వైపు నుంచి మీర్‌ఖాన్ పేట్ పవర్‌గ్రిడ్‌కు హైటెన్షన్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు సమాచారం ఇవ్వకుండానే వారు టవర్ల ఏర్పాటుకు అంగీకరించినట్లు రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి ఇష్టానుసారంగా టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విషయం తెలుసుకున్న రైతులు ఆదివారం గ్రామస్తులు, తోటి రైతులతో కలిసివెళ్లి టవర్ల నిర్మాణాన్ని అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఆర్.రాధిక, కాకి పెద్ద సత్తమ్మ, చిన్న సత్తమ్మ తదితరులు మాట్లాడుతూ.. టవర్లు ఏర్పాటుకు తమను ఇప్పటి వరకు ఎవరూ సంప్రదించలేదని, తాము సంతకాలు చేసినట్లుగా అధికారులకు చూపి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పీఎస్‌లో సదరు సంస్థపై ఫోర్జరీ కేసు పెట్టామని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. వారికి గ్రామస్తులు, తోటి రైతులు, నాయకులు రూప్లానాయక్, కాకి రవి, కాకి సంతోశ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని డ్రైవర్ మృతి

హయత్‌నగర్: స్కూటీపై ప్రయాణిస్తున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ కాలనీకి చెందిన కుంభం శ్రీను(23) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కీసరలో పని ముగించుకుని శనివారం రాత్రి స్కూటీపై ఇంటికి వస్తున్నాడు. కుంట్లూర్ సమీపంలో శివపార్వతుల విగ్రహాల సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొని శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.